క్లుప్తంగా

రుణమాఫీ నిర్ణయం చారిత్రాత్మకం

డీసీసీబీ మాజీ డైరెక్టర్ బస్వరాజ్



కొడంగల్: రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏక కాలంలో రుణ మాఫీ చేస్తామని ప్రకటించడం హర్షణీయమని డీసీసీబీ మాజీ డైరెక్టర్, కొడంగల్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాగాపురం బస్వరాజ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. రూ.2లక్షల వరకు మాఫీ చేయడం వలన.. రైతులు రుణ విముక్తులవుతారని పేర్కొన్నారు. రైతు సంక్షేమం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని, దివంగత నేత, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి తర్వాత రేవంత్‌రెడ్డి రైతుల పక్షాన పనిచేస్తున్నారని బస్వరాజ్ వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీని పలు విడతల్లో చేసిందని, ఆ మాఫీ మిత్తి డబ్బులకు కూడా సరిపోలేదని విమర్శించారు. ప్రస్తుత రుణమాఫీ రైతులకు మేలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న దాత

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని బీఆర్ఎస్ యువ నాయకుడు, ఘణాపూర్ ఎంపీటీసీ తనయుడు వెంకటేశ్ సూచించారు. ఆదివారం మండలం పరిధి ఘణాపూర్ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం సక్రియనాయక్‌తండాల్లో నిర్మిస్తున్న వీరాంజనేయ ఆలయానికి రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, వాడిత్య గణేశ్, చందర్ నాయక్, హన్మంతు, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జానపద కళల పరిరక్షణకు కృషి

బొంరాస్‌పేట: తెలంగాణ జానపద కళలను ఆదరించడంతో పాటు.. కళాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర జానపద సంఘం(టీఆర్‌జేకేఎస్) కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణయ్య అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధి రేగడిమైలారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలైలోన హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో రాష్ట్రస్థాయి సమావేశం ఉంటుందని తెలిపారు. అదే విధంగా సంఘం వెన్నంటి ఉంటున్న సారిపల్లి కొండల్‌రావుకు రవీంద్రభారతిలో ఘనసన్మాన కార్యక్రమం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమాలకు జానపద ప్రదర్శనలు కోలాటం, చిడుతల భజన బృందాలు ఉంటే తమను సంప్రదించాలని ఆయన కోరారు.

నిబంధనలు పాటించని మాంసం వ్యాపారులు

పెద్దేముల్: 'మటన్, చికన్ దుకాణాల వద్ద పరిశుభ్రత తప్పనిసరి. ముఖ్యంగా వానాకాలంలో. మార్కెట్ కంటే అధిక ధరలకు మాంసం విక్రయించరాదు. షాపు చుట్టూ జాలీలు ఏర్పాటు చేసుకోవాలి' అన్న పంచాయతీ నిబంధనలు వ్యాపారులు పాటించడం లేదని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపించారు. గతంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ మండల కేంద్రంలో దుకాణాల యజమానులకు నోటీసులు సైతం జారీ చేశారు. కానీ.. వ్యాపారుల్లో మార్పు రావటం లేదని పేర్కొన్నారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి పరిశుభ్రతతో పాటు.. దుకాణాల ఎదుట మాంసం ధరల పట్టికను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై తగిన చర్యలు చేపట్టాలన్నారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ శ్రేణులు

పరిగి: జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను గుర్తుకు చేసుకున్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలను భారత్‌లోనే కొనసాగించాలని బ్రిటీష్‌వారిపై పోరాటం చేసిన మహనీయుడు అని కొనియాడారు. ఎన్నో రంగాల్లో ఆయన ఎనలేని సేవలు అందించారని, ముఖర్జీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని సూచించారు.

బీజేపీలో పలువురి చేరిక

కొత్తూరు: మండల పరిధిలోని పెంజర్ల గ్రామానికి చెందిన బుల్కాపురం రఘుపతిరెడ్డితో పాటు పలువురు నాయకులు ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీ కుండువాలు వేసి వారిని ఆహ్వానించారు.

గిట్టుబాటుకాక.. బిల్లులు రాక



అడ్కిచెర్ల పాఠశాలలో వంట చేస్తున్న నిర్వాహకులు

పెరిగిన నిత్యావసర సరకుల ధరలు

- మధ్యాహ్న భోజనం వండలేక చేతులెత్తేస్తున్న నిర్వాహకులు
- అప్పుల పాలవుతున్నామంటూ ఆవేదన

పెద్దేముల్: 'మధ్యాహ్న భోజనం పథకం గిట్టుబాటు కావడం లేదు. నిత్యావసర సరకుల ధరలు భగ్గుమంటున్నాయి. బిల్లులు సక్రమంగా అందక, అప్పుల పాలవుతున్నాం. నెలనెలా జీతాలు ఇవ్వండి' అని మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రెండు మూడు నెలలకు ఒకసారి భోజన బిల్లులు వస్తే ఇబ్బందిగా ఉందని, ప్రభుత్వం ఇచ్చే బిల్లులకు పెరిగిన ధరలకు పొంతన లేకుండా పోయిందని వాపోతున్నారు.

బిల్లుల చెల్లింపులో అలసత్వం

మండల పరిధి 37 గ్రామ పంచాయతీల్లో 61 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 4వేల మందికి పైగా చదువుకుంటున్నారు. సుమారు 30పైగా పాఠశాలలకు వంట గదులు లేవు. ఆరు బయట లేదా, బడి ఆవరణలో వంటకాలు చేస్తున్నారు. ఇదే విషయాన్ని మండల సర్వసభ్య సమావేశాల్లో మాజీ సర్పంచ్‌లు, ప్రస్తుత ఎంపీటీసీలు ప్రస్తావించినా ఫలితం లేదన్న ఆరోపణలు వినవడుతున్నాయి. మధ్యాహ్న భోజన పథకంలో 90 శాతానికి పైగా విద్యార్థులు పాఠశాలల్లో భోజనం చేస్తున్నా.. ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో అలసత్వం వహిస్తోందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

కమీషన్‌కు బదులు జీతం

ప్రస్తుతం మార్కెట్లో కూరగాయాలు, నిత్యావసర సరకుల ధరలు బాగా పెరిగాయని, పెట్టుబడులు పెట్టలేక అప్పుల పాలవుతున్నామని నిర్వాహకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏ నెలకు ఆ నెల బిల్లు ఇచ్చినా.. అప్పుముప్పు తప్పుతుందని, బిల్లులు రాక తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లించలేకపోతున్నామన్నారు. కమీషన్‌కు బదులు నెలనెలా జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. గతేడాది ఇందూరు ఉన్నత పాఠశాలలో గిట్టుబాటు కావడం లేదని నిర్వాహకులు పథకం నుంచి తప్పుకున్నారు. అదే బాటల్లో మరి కొంత మంది ఉన్నట్లు సమాచారం.

అప్పుల పాలవుతున్నాం..



బిల్లులు రాక అప్పులు చేస్తున్నాం. నెలకు రూ.10వేలకు పైగా ఖర్చు అవుతోంది. ఎప్పటికప్పుడు బిల్లులు ఇస్తే ఇబ్బంది ఉండదు. నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయి. ఇదే విషయాన్ని పాలకులు, అధికారుల దష్టికి తీసుకెళ్లాం. ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన బిల్లు చెల్లించండి.
– సోనమ్మ, భోజన నిర్వాహకురాలు, తట్టెపల్లి

మూడేళ్లుగా ఇదే సమస్య



మూడేళ్ల నుంచి మధ్యాహ్న భోజనం గిట్టుబాటు కావడం లేదు. ధర పెంచాలని అధికారులను పదే పదే కోరుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. నెలకు కనీసం రూ.2వేలు కూడా గిట్టుబాటు కావడం లేదు. కమీషన్‌కు బదులు ప్రతి నెల జీతం ఇస్తే బాగుటుంది.
– గంగులు బాయి, తట్టెపల్లి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



మధ్యాహ్న భోజన పథకం బిల్లు ఆలస్యం కావడం, కూరగాయ ధరలు పెరగిన విషయం వాస్తవమే. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. బిల్లులు ప్రతినెలా అందేలా కృషి చేస్తాం. ప్రతి పాఠశాలలో పథకం విజయవంతంగా జరిగేలా చుస్తాం. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకుంటాం.
– వెంకటయ్య, ఎంఈఓ, పెద్దేముల్



తాండూర్-హైదరాబాద్ ప్రధాన రహదారిలో వానర సైన్యం

వామ్మో వానరులు

- విజృంభిస్తున్న కోతులు
- పంటపొలాల్లో విధ్వంసం
- ఇళ్లుపీకి పందిరేస్తున్న వైనం
- భయాందోళనలో ప్రజలు



పంట పొలంలో కోతుల గుంపు

ధారూరు: కోతులు వనాలను వీడి జనారణ్యంలో హల్‌చల్ చేస్తున్నాయి. పంట పొలాలు, ఇళ్లపై పడి నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. రహదారుల వెంట సంచరిస్తూ వాహనదారులను బెంబేలెత్తిసున్నాయి. ఇళ్లలోకిచొరబడి మహిళలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. చిందరవందర చేసి.. అందిన సామగ్రిని ఎత్తుకెళ్తున్నాయి.

హడలిస్తే.. బెదిరింపు

మండల పరిధి గ్రామాలు, తండాల్లో కోతుల బెడద పెరిగిపోయింది. జిల్లాలోని అన్ని మండలాల కంటే ధారూరు మండలంలో అడవులు 10 వేల ఎకరాల్లో ఎక్కువగా విస్తరించి ఉన్నాయి. అరణ్యం ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఊర్లపై పడి పడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు ఎవరూ సాహసించలేకపోవడంతో.. పల్లెల్లో వాటిదే రాజ్యమై పోయిందని, పాఠశాలకు వెళ్తున్న క్రమంలో విద్యార్థుల చేత ఉన్న టిఫిన్ బాక్సులను ఎత్తుకెళ్తున్నాయని ప్రజలు వాపోవుతున్నారు. దుకాణాలు, సంతల్లో చొరబడి సామగ్రిని చిందరవందర చేస్తున్నాయి. హడలిస్తే బెదిరిస్తున్నాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వెళ్లినట్టే వెళ్లి..

ఇళ్లల్లో మగవాళ్లు లేని సమయాల్లో కోతులు ఇంట్లోకి చొరబడి బడుతున్నాయని, వాటిని ఎదురించే ప్రయత్నం చేస్తే దాడులకు పాల్పడుతున్నాయని మహిళలు వాపోయారు. ఇళ్లపై దొరికిన వస్తువులను కిందకు పడేస్తున్నాయని తెలిపారు. వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తే.. వెళ్లినట్లే వెళ్లి.. తిరిగి వస్తున్నాయని పేర్కొన్నారు. కుక్కలకు, కొండముచ్చులకు కూడా కోతులు భయపడటం లేదని వాపోయారు. తాండూరు–హైదరాబాద్ ప్రధాన రోడ్డుపై సంచరిస్తూ వాహనదారులను ప్రమాదంలో పడేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి జనారణ్యం లోంచి కోతులను అడవులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉద్యమ బంధాలు విడదీయలేనివి

బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు శుభప్రద్ పటేల్



శుభప్రద్ పటేల్‌తో నాయకులు

షాద్‌నగర్: ఉద్యమ బంధాలు విడదీయలేనివని బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. పట్టణంలోని సాయిబాలాజీ టౌన్ షిప్‌లో నివాసం ఉంటున్న రాష్ట్ర సహకార సంఘం మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ స్వగృహానికి ఆదివారం శుభప్రద్ పటేల్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల పోరాటాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. ఉద్యమ సమయం నుంచి అందరి మధ్య విడదీయరాని బంధాలు ఏర్పడ్డాయని వెల్లడించారు. ఈ ఉద్యమ బంధాలు ఏ నాటికి మరిచిపోలేనవన్నారు. ప్రత్యేక రాష్ట్ర పోరాట ఉద్యమ జ్ఞాపకాలు అందరిలో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల నిర్వాహకులు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

భవనం సరే.. వైద్యులేరి?

సిబ్బంది కొరతతో రోగుల ఇబ్బంది ● వైద్యం అందక.. ప్రైవేటు బాట



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శిథిలా వస్థకు చేరగా.. ప్రభుత్వం రూ.1.56కోట్లతో నూతన భవనాన్ని నిర్మించింది. దానిని 10రోజుల క్రితం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. కానీ.. సరిపడా వైద్య సిబ్బంది లేక.. పని భారంతో ఉన్న సిబ్బంది, సరైన వైద్య సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు. చేసేది లేక రోగులు ప్రైవేటు ఆస్పత్రుల గడప తొక్కుతున్నారు.

ఒకే వైద్యుడు.. ఇద్దరు నర్సులు

ముగ్గురు వైద్యులు ఉండాల్సిన చోట ఒక్కరు, ముగ్గురు స్టాఫ్ నర్సులకు ఇద్దరే ఉన్నారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏలను అటెండర్లుగా పదోన్నతి కల్పించి, పీహెచ్‌సీకి పంపించారు. కానీ వెంటనే కలెక్టర్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై తీసుకెళ్లారు. దీంతో నిత్యం పీహెచ్‌సీకి బయటి రోగులు 150నుంచి 200 మంది వరకు వస్తుంటారు. వీరికి వైద్య సేవలు అందించాలంటే ముగ్గురు డాక్టర్లు ఉండాల్సిందే. ఒక్కరే ఉండటం వలన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

రోగులకు శాపంగా ..

సర్కారు దవాఖానల్లోనే కాన్పులు జరుపుకోవాలని ప్రభుత్వం సూచిస్తుండటం మంచిదే. కానీ.. అత్యవసర సమయంలో వైద్య సేవలు అందక బిడ్డల ప్రాణాల మీదకు వస్తుందని రోగుల అటెండర్లు, పరిసర ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆస్పత్రి భవనాన్ని ఆధునికీకరించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. సరిపడా వైద్య సిబ్బందిని నియమించకపోవటం రోగులకు శాపంగా మారిందని వాపోతున్నారు. చాలా కాలంగా ఇక్కడ ఇదే సమస్య ప్రజలను వెంటాడుతోందని పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని.. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తగిన వైద్యులు, నర్సులు, కిందిస్థాయి సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

డిజైన్ లోపంతోనే ఇబ్బందులు

- అధికారుల నిర్లక్ష్యంతో రూ.16కోట్లు వృథా
- ఫ్లై ఓవర్ నిర్మాణంతోనే కొత్తూరులో ప్రమాదాల నివారణ
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కూడళ్లలో రాకపోకలను పునఃరుద్ధరించాలని సీఐ నర్సింహారావుకు సూచిస్తున్న ఎమ్మెల్యే

కొత్తూరు: డిజైన్‌లో లోపంతోనే పట్టణంలో జాతీయ రహదారి వై జంక్షన్ కూడలిలో నిర్మించిన అండర్‌పాస్ వంతెనతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రజలు, స్థానిక నాయకుల ఫిర్యాదు మేరకు ఆయన ఆదివారం అండర్‌పాస్ వంతెనను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అధికారులు అండర్‌పాస్ నిర్మాణానికి సరైన ప్రణాళికతో డిజైన్ రూపొందించకపోవడం, ఇంజినీరింగ్ వ్యవస్థ వైఫల్యంతో రూ.16కోట్లు వెచ్చించి నిర్మించిన అండర్‌పాస్ వృథాగా మారిందన్నారు. కేవలం అధికారులు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా అయినట్లు ఆరోపించారు. ప్రమాదాల నివారణలో భాగంగా నిర్మించిన అండర్‌పాస్ వంతెన కారణంగా భవిష్యత్‌లో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ కూడళ్లలో జరిగే ప్రమాదాల నివారణకు తిమ్మాపూర్ పరిధిలోని పాపిరస్ పోర్ట్ నుంచి జేపీ దర్గా కూడలి వరకు ఫ్లైఓవర్ నిర్మించే విధంగా తాము కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. దీంతో పాటు ఎమ్మెల్యే చొరవతో మూసివేసిన పెంజర్ల, వై జంక్షన్ కూడలిలో పోలీసులు రాకపోకలను పునఃరుద్ధరించారు. దీంతో స్థానిక వ్యాపారులు, స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్, శ్రీను, గోవింద్‌నాయక్, ఆంజనేయులు, శ్రీనివాస్, కార్తీక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న భగీరథ సర్వే



ఇంటింటి సర్వే చేస్తున్న కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది

కుల్కచర్ల: తాగునీటి ఎద్దడి నెలకొనకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మిషన్ భగీరత ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ పరిధిలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, వారికి ఎంత నీరు అవసరం అన్న అంశాలపై ఇంటింటి సర్వే చేస్తున్నట్లు వెల్లడించారు. నివాసాల ఆధారంగా నల్లాల కనెక్షన్ల సంఖ్యను లెక్కించి, నీటి సరఫరాకు ప్రణాళికలు రూపొందిస్తామని వివరించారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య తదితరులు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

షాబాద్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఏఐటీయూసీ నాయకులు అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ పారిశ్రామికవాడలో ఏఐటీయూసీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో చాలా పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. అందులో వేలాదిగా కార్మికులు ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారని, సమస్యల పరిష్కారానికి యాజమాన్యాల దోపిడీకి వ్యతిరేకంగా ఏఐటీయూసీ పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ.. కంపెనీలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను అమలు చేయకపోతే యాజమాన్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, షాబాద్ సీపీఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, నాయకులు రఘురాం, మధు, మహిళా సంఘం నాయకురాలు మంజుల, రాములు, జాంగిర్, మహమూద్ తదితరులు ఉన్నారు.

బొడ్రాయి ఉత్సవాలు

షాబాద్: మండలంలోని కుమ్మరిగూడ గ్రామంలో ఆదివారం బొడ్రాయి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు బొడ్రాయికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతల మధ్య బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. బోనాల ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోనమోని కేతన, ఎంపీటీసీ దేశమొళ్ల అరుణ, నాయకులు రమేశ్‌యాదవ్, ఆంజనేయులు, నాయకులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

చిన్నారులకు యూనిఫాం

- జూలై మొదటి వారం నుంచి పంపిణీ
- మహిళా శక్తి సంఘాలకు బాధ్యత



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

దౌల్తాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినూత్న పథకాలు అమలు చేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటికే చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నారులకు ప్రీప్రైమరీ విద్యాబోధన చేయనున్నారు. దీంతో ఈ విద్యా సంవత్సరం నుంచి చిన్నారులకు ఉచితంగా యూనిఫాం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పక్షం రోజుల క్రిత ఉత్తర్వులు జారీ చేసింది.

మండలంలో 68 కేంద్రాలు

మండల పరిధిలో 68 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల పరిధిలో 0నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు 1,039 మంది ఉన్నారు. 3నుంచి 6 ఏళ్లలోపు 1,462 ఉన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మత్రమే ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేసేది. ఈ సంవత్సరం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ పాఠశాలలుగా మార్చే క్రమంలో 3నుంచి 6 ఏళ్లలోపు ఉన్న వారికి ఉచితంగా ఏక రూపదుస్తులు పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది.

మహిళా శక్తి సంఘాలకు ఊతం

అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు యూనిఫాంలు కుట్టి అందించాలని మహిళా శక్తి సంఘాలకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. యూనిఫాంకు సంబంధించిన డిజైన్‌లను ఎంపిక చేసి అందించారు. విద్యార్థులకు కొలతలను సంవత్సరాల వారీగా నిర్ణయించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు యూనిఫాం కుట్టించి ఇవ్వడంతో పాటు మహిళా సంఘాలకు ఆర్థిక భరోసా కలగనున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియ వేగవంతం చేసి జులై మొదటి వారంలో విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

త్వరలో పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు యూనిఫాంలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ బాధ్యత మహిళా సంఘాలకు అప్పజెప్పింది. ప్రస్తుతం కొన్ని కేంద్రాల్లో యూనిఫాంలు అందించినట్లు సమాచారం. మిగతా కేంద్రాల్లో త్వరలో పంపిణీ చేస్తారు. –మంజుల, సూపర్‌వైజర్, ఐసీడీఎస్

నిధులు రావు.. పనులు సాగవు!



ఎన్కెపల్లి సమీపంలో రోడ్డు దుస్థితి

మొయినాబాద్ రూరల్: అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వం కారణంగా బాకారం రోడ్డు అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. దీంతో గుంతల రోడ్డుపై ప్రయాణం చేయాలంటే అవస్థలు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులను రెండేళ్ల క్రితం నాటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించారు. కానీ సకాలంలో పనులు పూర్తి కాకపోవడంతో పరిసర ప్రాంత వాసులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. పనులు త్వరగా పూర్తి చేసి ఇబ్బందులను తీర్చాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని ఎన్కెపల్లి–బాకారం రోడ్డు విస్తరణ పనులకు అప్పటి ప్రభుత్వం 2022 మార్చిలో రూ.2.20 కోట్లు విడుదల చేసింది. మార్చి 13న నాటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పనులను ప్రారంభించారు. అంతర్రాష్ట్ర రహదారి నుంచి ఎన్కెపల్లి మీదుగా బాకారం వరకు రోడ్డు పనులను చేపట్టాల్సి ఉంది. కానీ కొంతమేరకు రోడ్డు పనులు పూర్తి చేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకొన్నాడు. పనులు అసంపూర్తిగా ఉండడంతో వాహనాదారులు, పరిసర గ్రామాల ప్రజలు గుంతలరోడ్డుతో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఈ రహదారి పనులు పూర్తి చేయాలని ప్రజలు, వాహనాదారులు కోరుతున్నారు.